క్లుప్తంగా

సేవా రత్న పురస్కారం



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

బొబ్బిలి: నాయీ బ్రాహ్మణ సంఘానికి, సామాజిక వర్గానికి, కులవృత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తున్న పట్టణానికి చెందిన చిలకలపల్లి శ్రీనివాసరావుకు ప్రజాసంకల్ప వేదిక సంస్థ రాష్ట్రస్థాయి సేవారత్న-2025 పురస్కారాన్ని అందజేసి సత్కరించింది.ఆదివారం విశాఖలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రజాసంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రంగ సాయిరెడ్డి తదితరులు శ్రీనివాసరావుకు పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. వారందరికీ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

డీఎస్సీ విజేతలకు సత్కారం



ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

రాజాం: మండలంలోని మొగిలివలస గ్రామానికి చెందిన డీఎస్సీ విజేతలను ఆ గ్రామ వినాయక మంటపం వద్ద గ్రామ పెద్దలు, యువత ఆదివారం సత్కరించారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన కరిమెళ్ల శ్రీనివాసనాయుడు, మేకల శ్రీనివాస్‌నుఅభినందించి జ్ఞాపికలు అందజేశారు. వీరు గ్రామంలో మిగిలిన యువతకు ఎంతో ఆదర్శమని గ్రామపెద్దలు అన్నారు.

శ్రీహరినాయుడుపేటలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ కేసరి

సంతకవిటి: మండలంలోని కృష్ణంవలస పంచాయతీ శ్రీహరినాయుడుపేట గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ గండేటి కేసరి ఆదివారం పారిశుద్ధ్య పనులు చేయించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికను పారిశుద్ధ్య కార్మికులు తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. అనంతరం వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. కాలువల్లో చెత్త పారబోయవద్దని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న శంబంగి

బొబ్బిలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని ఈనెల 2వ తేదీన వాడవాడలా ఘనంగా నిర్వహిద్దామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి నియోజకవర్గ సమన్వయకర్త శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని మండల కేంద్రాలు, గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించాలని చెప్పారు. అలాగే సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

రాజాం సిటీ: మండలంలోని ఒమ్మి గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాలు.. తెర్లాం మండలం పెదపాలవలస గ్రామానికి చెందిన అంపావల్లి సింహాచలం సైకిల్‌పై ఒమ్మి గ్రామంవైపు వస్తున్నాడు. పెరుమాళి నుంచి రాజాం వైపు వస్తున్న ద్విచక్రవాహనం సైకిల్‌ను ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ని రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రుడి కోడలు గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆకతాయిల వేధింపులు అరికట్టేందుకు శక్తి టీమ్‌లు

విజయనగరం క్రైమ్: ఆకతాయిల వేధింపులు అరికట్టేందుకు శక్తి టీమ్‌లు ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆరుగురు సభ్యులున్న బృందాలు ఐదు ఉంటాయని, ఒక్కో బృందం ఎస్‌ఐ నాయకత్వంలో పనిచేస్తుందని స్పష్టం చేశారు. అన్ని బృందాల పనితీరును పర్యవేక్షించేందుకు అడ్మిన్ అదనపు ఎస్పీ ఉంటారన్నారు. ఆపద సమయంలో ఫోన్‌లోని శక్తి యాప్‌ను సంప్రదిస్తే పోలీసుల బృందం వచ్చి రక్షణ కల్పిస్తారన్నారు.

కలిసిరాని కూరగాయల సాగు

- కూరగాయల సాగుపై వాతావరణం ప్రభావం
- వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- తెగుళ్లు, చీడపీడల ఉధృతి
- పెట్టుబడి కూడా దక్కడం లేదని రైతన్నల ఆవేదన



రామభద్రపురంలో తెగులు సోకి ఆకులు కుళ్లిపోతున్న బీర పంటను చూపిస్తున్న రైతు



రామభద్రపురంలో తెగులు సోకి పాడైపోతున్న కాకర పంట

రామభద్రపురం: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు కూరగాయల పంటల సాగుపై ప్రభావం చూపుతున్నాయి. బొబ్బిలి నియోజకవర్గంలో కూరగాయల సాగు చేస్తున్న రైతులు నష్టాలు చవిచూస్తు న్నారు.ఖరీఫ్ ప్రారంభంలో వేసవిని తలపించేలా కాచిన ఎండలకు పంటలను కాపాడుకోవడమే కష్ట మైం ది.ఈమధ్య కురిసిన వర్షాల వల్ల కూరగాయల పంటలు దెబ్బతింటున్నాయి.బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం,బొబ్బిలి,తెర్లాం,బాడంగి మండలాల్లో ఖరీఫ్ ప్రారంభంలో దాదాపు 474 ఎకరాల్లో రైతులు బీర, చిక్కుడు, కాకర, వంగ,బెండ,సొర,దొండ తదితర కూరగాయల పంటలను వేశారు.పూత, పిందె వచ్చి పంట చేతికందే సమయంలో వర్షాలు కురవడంతో తెగుళ్ల బారినపడుతున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వాతావరణ మార్పులు పంటలను దెబ్బతీస్తున్నాయి. ఉద్యానవనశాఖాధికారులు సూచించిన మందులను పిచికారీ చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు.

పెరిగిన పెట్టుబడి..తగ్గిన దిగుబడి

కూరగాయల పంటలు ఏవి సాగు చేసినా ఎకరానికి సుమారు రూ.30 వేల పైబడి పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు.దుక్కులు,విత్తనాలు,మొక్కలు నాటేందుకు, రసాయన ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులతో కలిసి పెట్టుబడి రూ.30 వేలు దాటిపోతోందని అంటున్నారు. ప్రస్తుతం చీడపీడల ఉధృ తి ఎక్కువగా ఉండడం, వర్షాలకు పంటలు దెబ్బతినడం వల్ల పెట్టుబడి కూడా దక్కేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు నెల ప్రారంభంలో వాతావరణ అనుకూల పరిస్థితుల వల్ల కూరగాయ పంటలు ఏపుగా పెరగడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. కానీ అల్పపీడ నం ప్రభావంతో విస్తారంగా కురిసిన వర్షాలు పంటలను దెబ్బతీశాయి. పొలాల్లో నీరు నిల్వఉండిపోవడంతో వేర్లు కుళ్లి పోయి మొక్కలు ఎండిపోతున్నాయి. గాలిలో తేమ శాతం పెరగడం వల్ల పంటలకు పండు తెగులు,ఆకుపచ్చ, వేరుకుళ్లు ,బూడిద తెగుళ్ల ఉధృతి పెరగడంతో పూత,పిందెలు,కాయలు రాలిపోయి దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. కూరగాయలకు మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పటికీ దిగుబడి లేదని, పెట్టుబడి కూడా దక్కేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో సరఫరా కాని ఎరువులు

కూరగాయల పంటలు సాగు చేస్తున్న రైతులకు కాలం కలిసి రాకపోగా ప్రభుత్వం కూడా సహకరించడం లేదు. ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు,ఇప్పుడు అధిక వర్షాల కారణంగా నష్టం తప్పడం లేదు. ఏదోలా కష్టపడి పంటను బతికించుకున్న రైతులకు ప్రభుత్వ సహకారం కొరవడింది. ఎరువుల సరఫరాలో ప్రభుత్వం చేతులెత్తేసింది. రైతు సేవా కేంద్రాల్లో యూరియా,ఇతర ఎరువులు దొరక్క రైతులు అగచాట్లు పడుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు యూరియా లభించడం లేదు. ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తుంటే వారు ఎమ్మార్పీ కంటే రూ.200 నుంచి రూ.300 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

ఉచిత పంటల బీమా అమలు చేయాలి



తెగుళ్ల బారినపడి కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి.గతంలో ఎప్పుడూ ఈస్థాయిలో తెగుళ్ల,చీడపీడలు ఆశించడం చూడలేదు. వర్షాల కారణంగా తాము సాగు చేస్తున్న బీర పంటకు తెగుళ్లు సోకి పసురంగులోకి మారిపోయింది.పూత,పిందె,రాలిపోయింది. మార్కెట్‌లో క్రేటర్ బీరకాయల ధర రూ. 600 పైబడి పలుకుతోంది.మంచి ధర ఉన్నా దిగుబడి లేదు.ప్రభుత్వం ఉచిత పంటల బీమా అములు చేయాలి.

– చొక్కాపు సత్యం, కూరగాయ రైతు,రామభద్రపురం

సస్యరక్షణ చర్యలు పాటించాలి



కూరగాయల రైతులు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన దిగుబడి వస్తుంది.ముందుగా పంట పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలి. నేల ఆరిన 19:19:19,లేదా 13:0:45 లేదా యూరియా వంటి ఎరువులను పిచికారీ చేయాలి. కలుపు మొక్కలు తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేలా చూసుకోవాలి.నేల ఆరిన తర్వాత రసాయన ఎరువులను నేలలో వేసుకోవాలి.

– పి.మోహనకృష్ణ, ఉద్యానవనశాఖాధికారి, రామభద్రపురం మండలం

సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

రాజాం: సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సంతకవిటి మండలం అప్పలఅగ్రహారం గ్రామానికి చెందిన సేంద్రియ వ్యవసాయ రైతు అవార్డు గ్రహీత, కృషివిజ్ఞాన కేంద్రం వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొడ్డేపల్లి సురేష్‌కుమార్ వ్యవసాయశాఖను కోరారు. ఆదివారం రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రసాయన ఎరువుల కొరత ఉందని, ఈ కారణంగా రైతులు పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముందస్తుగా ప్రణాళికలు లేకపోవడం, సేంద్రియ ఎరువు తయారీపై రైతుల్లో అవగాహన పెంపొందించకపోవడం, సేంద్రియ ఎరువులతో కలిగే లాభాలు రైతులకు తెలియకపోవడం వల్లే ఈ సమస్య వచ్చిందని చెప్పారు. రైతులు సేంద్రియ ఎరువుల తయారీతో పాటు వినియోగంపై దృష్టిసారించాలని, అవసరమైతే తమ కేంద్రం ద్వారా రైతులకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. సలహాలు, సూచనలకు రైతులు తమ ఫోన్ నెంబర్ 89856 27864ను సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలిరూరల్: మండలంలోని కలవరాయి సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఈఈ బి.రఘు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలవరాయి గ్రామం నుంచి జగన్నాథపురం వరకు విద్యుత్ లైన్‌ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్ధంతరంగా నిలిచిన నిర్మాణాలు



చిన్నయ్యపేటలో ఆఖరి దశలో నిలిచి పోయిన పాఠశాల భవన నిర్మాణ పనులు



ఏ.వి.పురంలో ప్లాస్టరింగ్, గచ్చుల పనులు పూర్తికాని పై అంతస్తు భవనం



కోడిశ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా భవన నిర్మాణాలు

రేగిడి: మండలంలోని పలు పాఠశాలల్లో అదనపు భవనాల నిర్మాణాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మన బడి నాడు-నేడు కింద నిధులు మంజూరు చేసింది. ఈనిధులతో కొంతమేర నిర్మాణాలు జరిగాయి.ఎన్నికలు సమీపించ డంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. టీడీపీ కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత వీటి నిర్మాణాల సంగతి పూర్తిగా విస్మరించింది. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం, మిగులు నిధులను మంజూరు చేయకపోవడంతో నిర్మాణాలు ముందుకుసాగడం లేదు.సంకిలి పంచాయతీలోని చిన్నయ్యపేట గ్రామ ప్రాథమిక పాఠశాల భవనం శ్లాబ్ నిర్మాణం, చుట్టూ ప్లాస్టరింగ్ పనులు ఎన్నికలకు ముందే పూర్తయ్యాయి.మిగతా పనులు పూర్తి కాకపోవడంతో ఓ ప్రైవేటు గదిలో పాఠశాల నిర్వహిస్తున్నారు. ఏ.వి.పురం ప్రాథ మిక పాఠశాల మొదటి అంతస్తును గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. రెండో అంత స్తు నిర్మాణం పనులు నిలిచిపోవడంతో విద్యార్థులంతా ఒకే గదిలో చదువుకోవాల్సి వస్తోంది. కోడిశ గ్రామ ఉన్నత పాఠశాలలో భవనాల శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వంలో మిగతా పనులు చేపట్టక పోవడంతో విద్యార్థులకు ఇరుకు గదుల్లోనే ఉపాధ్యాయులు పాఠాలను బోధించాల్సి వస్తోంది. ఈ భవనాల విషయం ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు వద్ద సాక్షి ప్రస్తావించగా.. నిధులు మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, నిధులు మంజూరైన వెంటనే భవన నిర్మాణాలు పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు.

నమ్మండి ఇది రోడ్డే..!



సీహెచ్.బొడ్డవలస-అక్కేనవలస మధ్య రోడ్డు దుస్థితి

చిత్రంలో కనిపిస్తున్నది దమ్ము మడి అనుకుంటే పొరపాటే. బొబ్బిలి మండలంలోని సీహెచ్.బొడ్డవలస నుంచి సుమారు పది గిరిజన గ్రామాలకు వెళ్లే రోడ్డు ఇది. తాజాగా కురిసిన వర్షాలకు ఈ గ్రావెల్ రోడ్డు ఎక్కడికక్కడే బురదమయమై అడుగు కూడా పెట్టలేని విధంగా తయారు కావడంతో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు పడుతూ లేస్తూ ప్రమాదకర ప్రయాణాలను సాగిస్తున్నారు. అధికారులు స్పందించి తారు రోడ్డు సదుపాయం కల్పించాలని గిరిజనులు వేడుకుంటున్నారు. – బొబ్బిలిరూరల్

వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం



బొబ్బిలి: బొబ్బిలిపట్టణంలో వినాయకుని శోభా యాత్ర



రేగిడి : బూరాడలో వినాయక నిమజ్జనం నిర్వహిస్తున్న భక్తులు



రాజాం: రాజాం పట్టణంలోని విద్యానగర్‌లో నృత్య ప్రదర్శన



వంగర: జె.కె.గుమ్మడలో వేలం పాటలో దక్కించుకున్న లడ్డూ ప్రసాదంతో తిరుపతి, గ్రామపెద్దలు



బాడంగి: బాడంగిలో వినాయకుడి ఊరేగింపు

బొబ్బిలి/రేగిడి/ బాడంగి/: బొబ్బిలి పట్టణంతో పాటు రేగిడి, బాడంగి మండలాల్లో ఊరూవాడా వినాయక చవితి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. బొబ్బిలి పట్టణంతో పాటు కొన్ని గ్రామాల్లో అయిదో రోజు ఆదివారం గణేష్ నిమజ్జనాలు నిర్వహించారు. రేగిడి మండలంలోని బూరాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మంటపంలో కొలువుదీరిన గణనాథుడికి గ్రామానికి చెందిన యూత్, ఉత్సవ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఆదివారం సాయంత్రం నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా వినాయకుని వద్ద లడ్డూ ప్రసాదాన్ని వేలంపాట వేయగా, గ్రామానికి చెందిన నీలాపు రాంబాబు దంపతులు రూ.16,600కు దక్కించుకున్నా రు. బాడంగి మండల కేంద్రంలో పలు మంటపాల నిర్వాహకులు వినాయక నిమజ్జనం చేశారు. ముగడ న్యూకాలనీలో ఉత్సవ కమి టీ సంగీత విభావరి, నృత్యాలు ఏర్పాటు చేశారు.ఇక్కడ సోమవారం అన్నదానం చేయనున్నారు. గ్రామాల్లో జరిగిన నిమజ్జనోత్సవాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాజాం: పట్టణంలోని విద్యానగర్‌లో వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్లాసికల్ డ్యాన్స్‌తో యువత అలరించారు. రాజాం పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన వీక్షకులు ఈకార్యక్రమాన్ని తిలకించారు.

జె.కె. గుమ్మడలో లడ్డూప్రసాదం వేలం

వంగర: మండలంలోని జె.కె.గుమ్మడ గ్రామంలో ఏర్పాటు చేసిన మంటపంలో వినాయకుడికి నైవేద్యంగా నివేదించిన లడ్డూను ఉత్సవ కమిటీ వేలం వేసింది. వేలం పాటలో గ్రామానికి చెందిన కొల్లి తిరుపతిరావు రూ.32 వేలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం వినాయక నిమజ్జనం చేపట్టారు.

శిఖామణిది అనుభూతి కవిత్వం



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర సాహిత్య విమర్శకుడు తిరుపతిరావు

రాజాం సిటీ: ప్రముఖ కవి, సాహిత్యవేత్త శిఖామణిది అనుభూతి కవిత్వమని ప్రముఖ ఉత్తరాంధ్ర సాహిత్య విమర్శకుడు పిల్లా తిరుపతిరావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 127వ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'శిఖామణి దళిత కవిత్వం-ఒక పరిశీలన' అనే అంశంపై ఆయన మాట్లాడారు. దళితుడుగా పుట్టి, దళితవాడలో పెరిగిన శిఖామణి తన జీవితగాధను కవితలుగా మలిచారని, అవి ఆనాటి దళిత జీవితాన్ని ప్రస్ఫుటం చేస్తాయని అన్నారు. పది కవితా సంపుటిలను రచించిన శిఖామణి కనీసం 35 దళిత సంబంధిత కవితలను రాశారని అన్నారు. కిర్రు చెప్పుల భాష, ఒక గాయి, మాచిమా, తవ్వకం, వాడే అశుద్ధ మానవుడు వంటి కవితలు ప్రఖ్యాతమయ్యాయని పేర్కొన్నారు. వెలివాడ జీవితాలను ఈ కవితల్లో కళ్లకు కట్టినట్టు రచించారని వివరించారు. దళిత ఉద్యమ కవిత్వం రాకముందే శిఖామణి దళిత కవిత్వాన్ని రాశారని అన్నారు. పొదిలాపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, రౌతు గణపతిరావునాయుడు, శాసపు సత్యనారాయణ, సమతం మహేశ్వరరావు, ఉరిటి గున్నేశ్వరరావు, రాజాపు శాంతారావు, అంబళ్ల రామ్మూర్తి, జరజాన నీలయ్య, పారుపల్లి కిరణ్‌కుమార్, పి.నాగేశ్వరరావు, పెంకి చైతన్య, వల్లూరు రామినాయుడు, తురంగి విశ్వనాథం, పడాల కవీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలి



కొండకెంగువలో ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలు చేస్తున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: గ్రామాల్లో గణపతి నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని బొబ్బిలి సీఐ కె.నారాయణరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో గణపతి మంటపాలను ఆదివారం సాయంత్రం సందర్శించి, నిమజ్జనోత్సవాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరేగింపుల్లో వివాదస్పద గీతాలు, అసహజమైన చర్యలు నిరోధించాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల ని, నిమజ్జనం సకాలంలో పూర్తిచేయాలని చెప్పారు. భారీ విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమ యంలో డీజే బాక్సులు,వాహనాలపై ఎక్కి నిల్చోవడం వల్ల మార్గం మధ్యలో వేలాడే విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలన్నారు. ఊరేగింపుల్లో మద్యం మత్తులో పాల్గొని, నిమజ్జన సమయంలో నీటిలోకి దిగి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని సూచించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఐకమత్యం



ఆధ్యాత్మిక వక్త శ్రీనివాసరావును సత్కరిస్తున్న దత్తపీఠం నిర్వాహకులు

రేగిడి: ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంచుతాయని ఆధ్యాత్మిక వక్త యాలాల శ్రీనివాసరావు అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని దత్తపీఠంలో ఆదివారం ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో మంటపాల వద్ద భక్తిగీతాలు, భజన కార్యక్రమాలు ఉండాలే తప్ప, ఇతర అసాంఘిక వ్యవహా రాలకు తావివ్వరాదని అన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తి భావం ,సేవా గుణం కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం ఆయన్ని దత్తపీఠం నిర్వాహకులు కిమిడి సూరపునాయుడు, వై.భాస్కరరావు, కిమిడి అచ్చిబాబు, వై. హేమసుందరరావు, కుదుతుల మురళి, తదితరులు సన్మానించారు.

వైద్యుడి ఔదార్యం

- రూ.15 లక్షలతో ఆలయ పునర్నిర్మాణం



పునః ప్రారంభానికి సిద్ధమైన శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయం



మార్బుల్స్‌తో ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దిన దృశ్యం

వంగర: రాజాం పట్టణంలో స్థిరపడిన వంగర మండలం రుషింగి గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు, మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత యలకల సురేష్‌కుమార్ తన ఔదార్యం చాటుకున్నారు. పుట్టిన ఊరి కోసం ఏదైనా మంచి చేయాలనే తపనతో తన స్వగ్రామం రుషింగిలో జీర్ణావస్థకు చేరుకున్న శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు పూనుకున్నారు. తన సొంత నిధులు సుమారు రూ.15 లక్షలు వెచ్చించి ఆలయాన్ని పునర్నిర్మించారు. ముఖద్వారం నుంచి ధ్వజస్తంభం, గర్భగుడి, గుడి గోపురం అంతా సర్వాంగ సుందరంగా నిర్మింపజేశారు. గ్రిల్స్‌తో క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించారు. తాగునీటి సదుపాయం, విద్యుద్దీకరణ పనులు కూడా పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగ ణంలో వివాహ కార్యక్రమాలు చేసుకునేందుకు వీలుగా సదుపాయాలు కల్పించారు. త్వరలో ఆలయాన్ని పునః ప్రారంభించనున్నారు. ఆలయాన్ని అత్యాధునిక హంగులతో నిర్మించిన డాక్టర్ యలకల సురేష్‌ను రుషింగి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు అభినందిస్తున్నారు.

ఊరి రుణం తీర్చుకోవాలి



ప్రతి ఒక్కరూ తాము పుట్టిన ఊరి రుణం తీర్చుకోవాలి. నేను పుట్టిన ఊరికి ఏదో ఒక మంచి పని చేయాలని ఆలోచించాను. గ్రామంలో జీర్ణావస్థకు చేరుకున్న పురాతన శ్రీసత్యనారాయణ స్వామి ఆలయాన్ని మాపూర్వీకులు యలకల రమణమ్మ, యలకల జోగులమ్మల జ్ఞాపకార్థం పునర్నిర్మించాను. ప్రజల్లో భక్తిభావంతోపాటు సేవాభావం పెంపొందాలి.

– డాక్టర్ యలకల సురేష్‌కుమార్, మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత రాజాం.

నత్తే నయం..!

- ముందుకు సాగని లింగాపురం-అంట్లవార గ్రామ రోడ్డు పనులు
- గోతులమయమైన రోడ్డుతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



అసంపూర్తిగా లింగాపురం- అంట్లవార గ్రామ రోడ్డు పనులు

తెర్లాం: మండలంలోని లింగాపురం-అంట్లవార గ్రామ బీటీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.2.40 కోట్లు నిధులు మంజూరయ్యాయి. మే 14న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన ఈరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి మూడు నెలలు కావొస్తున్నా ఇంతవరకు రెండు కల్వర్టులను మాత్రమే నిర్మించారు. మిగతా పనులకు సంబంధించి ఇంతవరకు మెటీరియల్ కూడా వేయలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు అట్టహాసంగా శంకుస్థాపన చేయడంతో రోడ్డు పనులు జరిగిపోతాయని, ఇక తమకు రాకపోకలకు ఇబ్బంది ఉండదని లింగాపురం, అంట్లవార గ్రామాల ప్రజలు ఆశించారు. కానీ మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో అసలు రోడ్డు పనులు జరుగుతాయో, లేదోనని ఆ గ్రామాల ప్రజలు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. పీఆర్‌ఐ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు వెంటనే ప్రారంభించి, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని లింగాపురం, అంట్లవార గ్రామాల ప్రజలు కోరుతున్నారు.